LONGEST LIVING NEWSPAPER IN TELUGU JOURNALISM    Visit Internet Edition @ www.zaminryot.com "e-mail : editor@zaminryot.com"

# జమీన్ రైతు

D.R. UTTHAMA ★★★ HOTEL
డి.ఆర్. ఉత్తమలో విందుల పసందు
♦ వెజిటేరియన్ భోజనం Rs. 59/-
♦ నాన్ వెజిటేరియన్ భోజనం Rs. 74/-
♦ ప్రతి ఆదివారం నెల్లూరు స్పెషల్ ఫుడ్‌తో బఫే లంచ్ రూ. 160/- లకే (అన్ని టాక్స్‌లతో కలిపి).
Signature Club Members only avail 20% Discount.
Phones : 317777 - 10 Lines

స్థాపకుడు : నెల్లూరు వెంకట్రామానాయుడు    సంపుటి : 72    సంచిక : 53    28.12.2001 శుక్రవారం    12 పేజీలు    విడిప్రతి : రూ.3.00లు    జీవప్రదాత : నెల్లూరు శ్రీరామమూర్తి

# అసమ్మతికి జోల పాటలు - మంత్రులకు చివాట్లు!

తన అధికారాన్ని సవాలు చేస్తూ, తన పార్టీ పరువు తీస్తున్న అసమ్మతి వాదులపట్ల కఠినంగా వ్యవహరించడానికి ధైర్యం చాలడం లేదు - ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారికి. తెలుగు దేశం పార్టీకి ఇటువంటి సంక్షోభాలు కొత్త కాదు. గత ఆరేళ్లలో ఎన్నోసార్లు ఇదే తరహాలో అంతర్గత తిరుగుబాట్లు తలెత్తాయి. కాని ఆ సమస్యలన్నింటిని ఎంతో చాకచక్యంగా పరిష్కరించాడు చంద్రబాబు. ఎప్పుడూ అసమ్మతి వాదులతో రాజీ ధోరణి ప్రదర్శించలేదు. హరికృష్ణ, దగ్గుబాటి వెంకటేశ్వరరావుల తిరుగుబాట్ల సమయంలో ముఖ్యమంత్రి అవలంబించిన వైఖరి అందరికీ తెల్సిందే. వారిద్దరు తమంతట తాముగా పార్టీ నుంచి వెళ్లి పోయేటట్లు చేయడమే కాక, వారివెంట ఒక్కరు కూడా నడవకుండా అష్టదిగ్బంధనం చేశాడు. 1996 పార్లమెంట్ ఎన్నికల సమయంలో బాలకృష్ణ అసమ్మతిని సైతం లెక్క చేయలేదు. బాలకృష్ణ ప్రచారానికి రాకుంటే ఎన్నికలలో ఫలితాలు తారు మారయ్యే ప్రమాదం వుందని భయపడినా - రాజీ పడడానికి ఇష్టపడలేదు. చివరకు బాలకృష్ణ లేకుండానే ఎన్నికలు నిర్వహించాడు.

తమ స్వంత కుటుంబ సభ్యుల పట్లనే అంత నిక్కచ్చి వైఖరి, నిబ్బరం కనపర్చిన చంద్రబాబు ఇప్పటి అసమ్మతి వాదుల పట్ల మాత్రం ఎందువల్లనో వెనుక ముందు లాడుతున్నాడు. సాధ్యమైనంత వరకు అసమ్మతి ఎమ్మెల్యేల పట్ల రాజీ పద్ధతి పాటించాలని చూస్తున్నాడాయన. వారిని రెచ్చగొట్టడం కాని, వారిపట్ల కఠినంగా వ్యవహరించడం కాని, వారిని దూరంగా పెట్టడం కాని జరగడం లేదు.

ప్రభుత్వ విప్ దయాకరరావు అసమ్మతీయులకు విందు ఇవ్వడాన్ని చంద్రబాబు తీవ్రంగా పరిగణిస్తాడని అందరూ ఎదురు చూశారు. ఒక రకంగా అసమ్మతివాదులు కూడా తాడో పేడో తేల్చుకుందాం అనే తెగింపు వైఖరితో సిద్ధపడ్డారు. కాని ముఖ్యమంత్రి ఈ విందు పట్ల కాళ్లబేరం చూపి, అసమ్మతీయులను నిరాశపరిచాడు. దయాకర రావును పిలిపించి బ్రతిమలాడే ధోరణిలో మాట్లాడాడు ముఖ్యమంత్రి. మా జిల్లా మంత్రిని కూడా విందుకు పిల్చి వుంటే బాగుండేది కదా అని అడగడం తప్ప, నువ్వు చేసింది తప్పు అని చెప్పలేక పోయాడాయన. పైపెచ్చు దయాకరరావు కొంచెం తొందరపడి, మా జిల్లా మంత్రితో కల్సేది కల్ల, అది ఈ జన్మలో జరగదు అని కుండబ్రద్దలు కొట్టినట్లు చెప్పేశాడు.

ఈ పరిణామం అసమ్మతి వాదులకు ఉత్సాహం కల్గించింది. ముఖ్యమంత్రి తమను చూసి భయ పడుతున్నాడు అన్న వార్తలు వారిని సంతోషంతో వుక్కిరి బిక్కిరి చేసేస్తున్నాయి. ఇంత కాలం నిశ్శబ్దంగా వుండిన ఎమ్మెల్యేలు కూడా ధైర్యం చెసి అసమ్మతీయులతో ముచ్చట్లు మొదలు పెట్టారు. ఈ వేడి ఇట్లానే కొనసాగితే తమకు మంచిది అన్నది ఎమ్మెల్యేల అభిప్రాయం. తాము ఎదురు పడితే ముఖం చిట్లించుకుని, ఒకటి రెండు నిమిషాలకంటే ఎక్కువగా మాట్లాడడానికి ఇష్టపడని ముఖ్యమంత్రి ఇప్పుడు తమ కోసం ఎదురు చూస్తూ కూర్చుని వుంటున్నాడన్న నిజం వీరికి నమ్మశక్యం కావడం లేదు. ఏ ఎమ్మెల్యే ఏ పని అడిగినా అప్పటికప్పుడు అధికారులను పిలిపించి ఆర్డర్లు వేస్తున్నాడు ముఖ్యమంత్రి. తెలుగుదేశంలో ఇది వూహించని విచిత్రం.

అసమ్మతి కనపరుస్తున్న ఎమ్మెల్యేలను ఏదో ఒక రకంగా సంతృప్తి పర్చాలన్నది చంద్రబాబు ఆలోచన. అందువల్లనే ఆయన వారితో గంటల తరబడి ముచ్చట్లాడుతున్నాడు. పొరపాటున కూడా ఒక్క కఠినమైన మాట అనడం లేదు. పైపెచ్చు మీరు ఇట్లా పత్రికలకెక్కితే ఎట్లా, పార్టీ నష్ట పోతుంది కదా, మీకేమి కావాలో నన్ను అడగండి అని బుజ్జగిస్తున్నాడాయన. దీనితో - ఈ అసమ్మతి ఇట్లానే కొనసాగితే బాగుండును అని భావిస్తున్నారు ఎమ్మెల్యేలు. ఎవరికి తోచిన రీతిలో వారు ఆ నెగడును ఎగదోస్తున్నారు.

అమ్మతీయులను ఏమీ అనలేని నిస్సహాయత - సీనియర్ మంత్రుల పట్ల చిరాకుగా మారుతున్నది. పార్టీలో ఇంతటి సంక్షోభం తలెత్తితే ఒక్క సీనియర్ మంత్రి కూడాచొరవ చూపి దాన్ని నివారించడానికి ప్రయత్నించడం లేదని నిష్ఠూరపడుతున్నాడు ముఖ్యమంత్రి. మీకెవరికీ ఏమీ పట్టకుంటే ఎట్లా, అన్ని సమస్యలు నేను ఒక్కడినే చూసుకోవాలా, మీకు బాధ్యత లేదా నాకు మాత్రం ఎందుకీ యాతన, నాతో వుండే వారెవరో వుండి పొండి, మెజార్టీ చాలకుంటే ప్రతిపక్షంలో కూర్చుంటాను

కొరవ 7వ పేజీలో

**ఎన్నియో యుద్ధముల ఆరితేరిన ముఖ్యమంత్రి కూడా, అసమ్మతీయులను ఏమీ చేయలేక చేతులెత్తేస్తున్నాడు. గట్టిగా మాట్లాడితే కొంప మునుగుతుందని భయపడుతున్నాడు; ఆయనలోని ఈ బేలతనం ఎమ్మెల్యేలకు భలే సంతోషంగా వుంది; అసమ్మతి శాశ్వతంగా వుండిపోతే బాగుండునని భావిస్తున్నారు వారు.**

## వాడి వేడి లోపించిన అసెంబ్లీ సమావేశాలు!

అసెంబ్లీ సమావేశాలు నిరాటంకంగా జరిగి పోతున్నాయి; మామూలు ధోరణికి భిన్నంగా నడుస్తున్నాయి. శాసనసభ సమావేశం మొదలైందంటే చాలు - తెలుగుదేశం ప్రభుత్వంపై విరుచుక పడడం కాంగ్రెస్ సభ్యులకు అలవాటు. అందుకు పెద్ద కారణం కూడా అవసరం లేదు. ప్రభుత్వం చేసే ప్రతి పనిలో ఏదో ఒక తప్పు కన్పించక మానదు. దాన్ని ఎత్తిచూపితే చంద్రబాబుకు కోపం; వీరు ఒక మాట అంటే ఆయన పది తిట్లతో బదులిస్తుంటాడు. దానితో ఉద్రిక్తత ఏర్పడ డం, వాకౌట్లు, నిరసనలతో సందడిగా వుండడం అలవాటు. కాని ఈ సమావేశాలలో ఆ వేడి, వాడి కన్పించడం లేదు.

ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టగల్గిన కీలక సమస్యలపై ఎందువల్లో కాంగ్రెస్ సభ్యులు ఉదాసీనంగా వుండి పోతున్నారు. అనంతపురంలో కాంగ్రెస్ నేతల హత్యల వంటి తీవ్రాతి తీవ్ర సమస్యలపై కూడా ప్రభుత్వాన్ని నిలదీయడానికి ప్రయత్నం జరగలేదు. కృషి బ్యాంక్, ఏలేరు స్కాం వంటివి నామమాత్రపు ప్రస్తావనలతో సర్దుక పోతున్నాయి.

కాంగ్రెస్ వాదులకు చంద్రబాబు పట్ల ఎందుకింత ప్రేమ పుట్టుకొచ్చిందో అర్థం కావడం లేదు పరిశీలకులకు.




మనుబోలు బైపాస్ రోడ్డు వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో బోల్తాపడిన ట్రాక్టర్, ప్రక్క ఫోటోలో మృతులు. (వార్త 5వ పేజీలో)

# తీవ్రవాద నిర్మూలనకు యుద్ధం మార్గం కాదు!

సరిహద్దులలో యుద్ధ వాతావరణం ఏర్పడి వుంది; కార్గిల్ చేదు జ్ఞాపకాలు మనసు నుంచి చెదిరిపోక ముందే మరొకసారి యుద్ధ భేరి మ్రోగించవల్సి రావడం విచారకరం. డిశంబర్ 13వతేది పార్లమెంట్‌పై తీవ్రవాదుల దాడి జరిగిన నాటి నుంచి యుద్ధం గురించి మాట్లాడడం మన రాజకీయ వాదులకు ఫ్యాషన్ అయిపోయింది.

ప్రధానమంత్రి, ప్రతి ప్రభుత్వ ప్రతినిధి యుద్ధ ప్రేలాపనలతో మునిగి తేలుతున్నారు. దినపత్రికలు తెరిస్తే చాలు - యుద్ధం జరిగి పోతున్న దేమోనన్న భావన కల్గుతున్నది. ఎక్కడ ఏ కేంద్ర మంత్రి కన్పడినా పత్రికల వారు అతడిని చుట్టుముట్టి, యుద్ధం గురించి ప్రశ్నలు అడగడం, అతగాడు తనకు తోచిన అభిప్రాయాలు వ్యక్తం చేయడం, వాటికి విశేష ప్రచారం లభించడం మామూలై పోయింది.

యుద్ధం అంటే ఎంత తీవ్రమైన అంశమో ప్రశ్నలు అడిగేవాడికి తెలియదు; సమాధానాలు చెప్పేవాడికి తెలియదు. యుద్ధం వంటి అంశాలను ఎవరు పడితే వారు మాట్లాడడానికి లేదని, యుద్ధంపై ఏ నిర్ణయం తీసుకోవడానికైనా ఒక పకడ్బందీ వ్యవస్థ వుందని, కేవలం నలుగురైదుగురు కీలక వ్యక్తులకు మాత్రమే ఇందులో పాత్ర వుంటుందని తెలుసుకోకుండా ప్రతి కేంద్ర మంత్రి యుద్ధంపై వ్యాఖ్యలు చేస్తున్నారు.

ప్రధానమంత్రి వాజ్‌పాయి కూడా భారత దేశంపై యుద్ధాన్ని బలవంతంగా రుద్దుతున్నారని పదే పదే ప్రకటిస్తున్నారు; రక్షణ మంత్రి ఫెర్నాండెజ్ ప్రేలాపనలకు పరిమితే లేదు. సరిహద్దులలో సైన్యం మోహరింపు, మిసైల్స్ తరలింపు వంటి వార్తలు మరొక ప్రక్క ప్రజలలో ఉద్విఘ్నతను పెంచుతున్నాయి. సాక్షాత్తు రక్షణ మంత్రి సరిహద్దులలో ఉద్రిక్తత అదుపు తప్పిపోయే దశకు చేరుకున్నదని ప్రకటిస్తున్నప్పుడు ప్రజలలో వేడి పుట్టడంలో ఆశ్చర్యం ఏమి వుంది? ఇట్లా మాట్లాడలేరు. వీరు చెప్పింది - యుద్ధం చేసి అయినా పాకిస్తాన్ తీవ్రవాదులకు ఆశ్రయం కల్పించకుండా నివారించాలని. ఎంత తెలివి తక్కువ ఆలోచన ఇది?

చీటికి మాటికి యుద్ధం చేయడానికి భారతదేశం అమెరికా కాదు; కనీసం ఇజ్రాయిల్ కూడా కాదు.

**యుద్ధం వల్ల కలిగే పరిణామాల పట్ల కనీస అవగాహన కూడా లేకుండా కేంద్ర మంత్రులు పదేపదే యుద్ధప్రస్తావన తేవడం గర్హనీయం; యుద్ధం అంటూ జరిగితే నష్టపోయేది మనం-లాభపడేది అమెరికా అన్న వాస్తవం గ్రహించాలి.**

అయితే నిజంగానే మన దేశం యుద్ధానికి సిద్ధమౌతున్నాదా అన్నది ప్రశ్న. పాకిస్తాన్‌కు బుద్ధి చెప్పడానికి యుద్ధం కంటే వేరే ప్రత్యామ్నాయం ఏదీ లేదన్న అభిప్రాయాన్ని కల్గిస్తున్నారు కేంద్ర మంత్రులు. అంతర్జాతీయ రాజకీయ పరిస్థితులు, మరీ ముఖ్యంగా దక్షిణాసియాలో వర్తమాన పరిస్థితుల పట్ల కనీస అవగాహన కల్గిన వారెవ్వరూ అంతకంటే ముఖ్యంగా పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్ కాదు. పాలస్తీనా అసలే కాదు. ఆఫ్ఘనిస్తాన్ వద్ద తుప్పుపట్టిన తుపాకులు తప్ప మరేవీ లేవు కాబట్టి అమెరికా తన యుద్ధ విమానాలతో బీభత్సం సృష్టించగల్గింది. ఎటువంటి ప్రతిఘటన లేకపోయినప్పటికీ ఆఫ్ఘనిస్తాన్‌పై అమెరికా దళాలు 12వేల

తరువాయి 7వ పేజీలో

## శాంతిమార్గం విచ్ఛిన్నం చేయవద్దు!

పాకిస్తాన్‌పై దౌత్యపరమైన వత్తిడి తీసుకుని రావడం కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలలో సింధూ నదీ జలాల ఒప్పందం కూడా వుందని వార్తలు వస్తున్నాయి. అదే నిజమైతే మాత్రం మన ప్రభుత్వం పెద్ద పొరపాటే కాదు, నేరం చేస్తున్నట్లే లెక్క. సింధూ నదీ జలాల పంపకం కోసం 1960 సెప్టంబరు 19వతేది అప్పటి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ, పాక్ సైనిక నేత ఫీల్డ్ మార్షల్ మొహమ్మద్ ఆయూబ్ ఖాన్ ఒక ఒప్పందంపై సంతకాలు చేశారు.

ప్రపంచంలోనే అత్యంత విశాలమైన డెల్టా వుంది సింధూ నదికి; దాదాపు 64లక్షల ఎకరాల మాగాణి భూమి సాగులో వుందని అంచనా. సింధూ నది టిబెట్‌వైపున్న హిమాలయాలలో పుట్టి, జమ్ముకాశ్మీర్ మీదుగా ప్రవహించి పాకిస్తాన్‌లోకి ప్రవేశిస్తుంది. దీనికి అనుబంధంగా జీలం, చీనాబ్ నదులు ఇండియాలో పుట్టి, పాక్‌లోకి వెళ్తున్నాయి. ఇవి తూర్పు నదులు. పశ్చిమ దిక్కుగా రావి, బియాస్, సట్లెజ్ నదులు పాకిస్తాన్‌లో పుట్టి ఇండియాలోకి వస్తున్నాయి. 1960 కరాచీ ఒప్పందం ప్రకారం తూర్పు నదుల నీరు మనం, పశ్చిమ నదీజలాలు పాకిస్తాన్ వాడుకోవాలి. ఈ ఒప్పందం తర్వాత మూడుసార్లు రెండు దేశాల మధ్య యుద్ధాలు జరిగినా ఒప్పందానికి హాని కలుగలేదు. ఇప్పుడు ఆ ప్రయత్నం చేస్తున్నది బిజెపి కేంద్ర ప్రభుత్వం. అదే జరిగితే రెండు దేశాలలోని కొన్ని లక్షల మంది రైతుల జీవితాలు చిందరవందర అవుతాయి. చర్చలతో, సామరస్యంతో సమస్యల పరిష్కారం సాధ్యమని 40ఏళ్ల క్రితం జవహర్‌లాల్ నెహ్రూ చూపించిన శాంతి మార్గాన్ని విచ్ఛిన్నం చేయడం సరైన చర్య కాదు.


# నెల్లూరు జిల్లా ప్రజానీకానికి 2002 నూతన సంవత్సర శుభాకాంక్షలు



ఈ ఏడాది మీ జీవితం
నిత్యనూతన వసంతం కావాలని,
ప్రతి ఇల్లు ఆనందాల
లోగిలిగా మారాలని
మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నాను.

**ఆదాల ప్రభాకర రెడ్డి**
మాజీ గృహనిర్మాణ శాఖామాత్యులు
ఎమ్మెల్యే, అల్లూరు

